# నీడ

రాత్రి బాగా ఆలస్యంగా నిద్రపోయే సరికి, సుందరమాచారికి మామూలు వేళకు మెలకువ రాలేదు. దానికి తోడు రాత్రి అంతా ఒకటే పీడ కలలు. ఆదమరచి రవ్వంత కునుకు పట్టిందో లేదో స్వామివారి ఆలయం నుంచి "సుప్రభాతం' వినిపించడం మొదలుపెట్టింది. వెంటనే ఉలిక్కిపడి లేచాడు. ఈ అరవై సంవత్సరాల జీవితంలో ఎన్నడూ ఇంత ఆలస్యంగా లేవడం జరగలేదు. రోజూ తొలి ఝామునే లేవడం. స్వామివారి పూజకు ఏర్పట్లు చేసుకోవడం సుప్రభాతానికి అందరికన్న ముందుగానే వెళ్ళడం తను ఈనాటి వరకూ చేస్తున్నాడు.

కానీ ఈనాడు ఇలా ఆలస్యం జరిగే సరికి అతని మనస్సు చివుక్కుమన్నది. మెలకువతోబాటు ఇంకొక ఆలోచనకూడా వచ్చింది. ఈరోజు విజయదశమి. మహారాజావారు వచ్చే రోజు. నిన్న పెద్దయ్యగారు చెప్పనే చెప్పారు.

"ఆచారీ రేపు ఒక అడుగు ముందుగారా" అని. ఈరోజు తను చేయవలసిన పని బోలెడంత వుంది. సంవత్సరమంతా ఏ ప్రాంతంలో తిరిగినా ఏ దేశం వెళ్ళినా, ఎన్ని రాచకార్యాలు వున్నా మహారాజావారు తప్పక విజయ దశమినాడు ఈ ఆలయానికి వస్తారు. ఉదయంనుంచి రాత్రి వరకు ఆయలంలోనే గడుపుతారు.

మొట్ట మొదటి సారిగా ఇరవై సంవత్సరాల క్రితం వారు ఈ ఆలయానికి వచ్చారు. ఆనాడు వారి తరపున ప్రత్యేకమైన పూజలు, అలంకారాలు, ఉత్సవాలు ఎన్నో స్వామి వారికి జరిగాయి.

తనకు ఆరోజు ఎప్పడికీ జ్ఞాపకమే అన్ని రోజులలాగానే ఆనాడు కూడా తను ఆలయానికి వచ్చాడు. ఆలయంలో పాదం పెట్టగానే కుడి కన్ను అదిరింది. గుమ్మంలోనే మహంతుగారు ఎదురయ్యారు. "సుందరమాచారీ నీకు ఈ రోజునుంచి ప్రమోషన్ ఇస్తున్నాం. ఈనాటినుంచి ప్రతి లక్ష్మివారం స్వామివారి అర్చకత్వం నీకు అప్పచెప్పుతున్నాం. ఆనాటి ఏర్పాట్లు అన్ని నీ అజమాయిషీ మీదనే జరుగుతాయి. జాగ్రత్తగా చూసుకో" అంటూ చిరునవ్వుగా అన్నారు.

ఈ కొత్త పదవిని తలచుకోగానే తనకు ఎంతో భయం వేసింది. తనకంటే ఎందరో పెద్దలున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ ఆలయాన్ని అంటిపెట్టుకుని స్వామి వారిని సేవించుకుంటూ తరించినవారున్నారు. వారందరినీ కాదన్నట్టు ఈ అర్చక పదవి తనకివ్వగానే సుందరమాచారికి ఎంతో ఆనందం వేసింది. అంతులేని భయం కూడా వేసింది.

ఆనాడు లక్ష్మీవారం, అందులో విజయ దశమి. స్వామివారి పూజకు మామూలుకన్న భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. తను కొత్తపనిలో సతమతమవుతున్నాడు. ఇంతలో పెద్దయ్యగారు హడావిడిగా వచ్చి -

"ఆచారీ నీ పుణ్యాం పండిదయ్యా. మహారాజావారు వస్తారుట మన ఆలయం చూడటానికి. సిద్ధంగా వుండు" అని అన్నారు.

తను మహారాజా వారి పేరు విన్నాడు. కానీ వారి దర్శనం చేసుకునే అదృష్టంమటుకు ఈ నాటివరకూ కలగలేదు. ఆయన తమ ఆలయానికి వస్తున్నారంటే తనకు ఎంతో సంతోషం కల్గింది. మన రాజావారికి వారి పరగణాలో ఎన్నో ఆలయాలువున్నై. వారికోటలోనే పార్వతీదేవికి బ్రహ్మాండమైన ఆలయం ఉంది. ఇన్ని ఆలయాలువున్నా, ఈ ఆలయాన్ని వారు చూడటానికి వస్తున్నారంటే. అన్ని రోజులకంటే స్వామివారిని ఇంకా శ్రద్ధగా ఎక్కువ అందంగా అలంకరించాడు.

ప్రదోష కాలంలో పూజ జరుగుతూ వుండగా జనమంతా ఒక్కసారి అప్రమత్తులయ్యారు. ఎవరి నోట విన్నా అదే మాట "మహారాజావారు వస్తున్నారు". మహారాజావారు రానేవచ్చారు. ముందు కాల్బలం వెనక అశ్వదళం. వారి వెనుక ఏనుగ అంబారీ మీద వూరేగుతూ రాణి వారితో సహా ఆయన వచ్చారు. పచ్చల తురాయి, మెడలో వజ్రాల హారం. చేతి వేళ్ళకు రవ్వలు, కెంపులు ముత్యాల ఉంగరాలు. అన్నింటికన్నా ముఖ్యంగా కన్పడేది ఆ ముఖంలో ఠీవి. వారికి వామ భాగంలో రాణివారున్నారు. సాక్షాత్తూ పార్వతీదేవిలాగా. అప్పుడే పాలసముద్రంలో ఉద్భవించిన లక్ష్మీదేవిలాగా ఎంతో కళకళ లాడుతోంది. ఈ దృశ్యం చూస్తుంటే ఈ ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఇటువంటి మనుష్యులు, మహారాజులు వున్నారా! అని అనిపించింది.

ఆలయ లాంఛనాలు మర్యాద అనుసరించి రాజావారు రాగానే, ఆలయ ధర్మకర్తలు, మహంతు, పేష్కార్లు ప్రధాన అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద ప్రవచనంతో, నాదస్వరంతో వారిని ఆలయం లోపలికి తీసుకువచ్చారు.

ఆలయంలో పాదం పెట్టిన మరుక్షణం వారి ముఖంలో ఠీవి కన్నా, భక్తి ఎక్కువ కన్పించింది. ఆయన్ను చూడగానే ఎవరో ఆత్మీయుడిని చూసినట్లు, ఎంతో కాలం క్రింద విడిపోయిన ప్రాణస్నేహితుడిని మళ్ళీ కలుసుకున్నట్లు అనిపించింది. ఆలయంలో దైవానికి తప్ప మరెవ్వరికీ నమస్కారం చెయ్యకూడదని తనకు తెలుసు. కానీ వారిని చూడగానే అప్రయత్నంగానే చేతులు జోడించి తల వంచి వారికి నమస్కారం చేశాడు.

రాజావారు తన వంక చూసి "తప్పు ! ఆలయంలో మనం మానవులకు నమస్కరించకూడదు" అంటూ చిరునవ్వుతోనే హెచ్చరిక చేశారు.

ఆనాటి ప్రధాన అర్చకుడుగా సుందరమాచారి పూజ ప్రారంభించాడు. మహారాజావారు స్వామివారికి వెలలేని కానుకలు సమర్పించారు. పూజా విధానం చూసి ఎంతో ఆనందించారు. సుందరమాచారిని మెచ్చుకున్నారు. తరువాత చాలా సేపటివరకూ స్వామివారి సన్నిధిలో మౌనంగా కూర్చున్నారు. ఆనాటి పూజలన్నీ నిర్విఘ్నంగా పూర్తి అయ్యాయి. ఆలయం తలుపులు వేసే వేళయింది. కానీ ఆ భక్తుడిని వెళ్ళమని చెప్పే ధైర్యం ఎవ్వరికీ లేకపోయింది. చివరకు తనే ధైర్యం తెచ్చుకుని "తమరు విశ్రాంతి తీసుకునే వేళ అయింది" అని మహారాజా వారితో మనవి చేశాడు. రాజావారు ఉలిక్కిపడ్డారు. ధ్యానంలోంచి మళ్ళీ ఈ లోకంలోకి వచ్చినట్లు కన్పించారు. రాణీగారి వంక తిరిగి "ఈ ఆలయం స్వామి ఎంతో చాగున్నాయి కాదూ !" అని అన్నారు. అవునన్నట్టుగా ఆవిడ తల వూపింది. వచ్చిన సిబ్బంది కూడా చాలా ఆనందించారు.

రాజావారు. రాణిగారు స్వామివారి పాదాలకు నమస్కారం చేసి, ఒక్కక్షణం అట్లాగే చూస్తూ నిలబడ్డారు. రెండడుగులు కెనక్కి వచ్చి మళ్ళీ ఆగారు. రాజావారు స్వామివారి వంక చూశారు. మనస్సులో ఏదో ఆలోచన వచ్చింది. భార్యవంక చూశారు. ఆవిడ కూడా వీరివంకనే చూస్తోంది.

రాజావారు తమ మెడలోని వజ్రాలహారం తీసి సుందరమావారి చేతులో పెడుతూ “ఇది స్వామివారి మెడలో వుంచండి” అని అన్నారు. చూడటానికి ఇనుముతో చేసిన హారంలాగా కనిపిస్తోంది. వజ్రాలు మాత్రం చాలా విలువగలవిగా కనిపిస్తున్నాయి. ఇటువంటి హారం రాజావారు మెడలో ఎందుకు వేసుకున్నారో తనకు అర్థం కాలేదు.

అప్రయత్నంగా రాణిగారి వంక చూశాడు. ఆవిడ ముఖంలో కోపం కనిపిస్తోంది. మహంతు వంక చూశారు. ఆయన తనతో “స్వామివారిని ఆ హారంతో అలంకరించండి’ ’ అని అన్నాడు.

ఆ రోజున స్వామివారి మెడనిండా గులాబీపూల దండలు, రకరకాల పువ్వులు, రకరకాల ఆభరణాలు దేదీప్యమానంగా వున్న వారి విగ్రహాన్ని చూస్తూవుంటే నిత్యం చూసే తన కే ఆనందంతో హృదయం నిండిపోతుంది. ఆ హారం వారి మెడలో వేస్తూంటే ఎందుకనో చేతులు గజగజా వణికాయి. కంఠం గద్గదమైంది. మనస్సు మూగపోయింది. అల్లాగే చూస్తూ నిలబడ్డాడు.

“ఆచార్లుగారూ” అంటూ మహారాజావారు పిలిచారు. తను దగ్గరగా వెళ్ళి నమ్రతగా నిలబడ్డాడు. “నాది ఒక్కటే కోరికి నేను జీవిచినంతకాలం ఈ హారం స్వామి వారి మెడలో నిత్యం వుండాలి. ఎట్టి పరిస్థితులలో కూడా తీయవద్దని నా ప్రార్థన” అని రాజావారు అన్నారు. ఏం సమాధానం చెప్పాలో తనకు తెలియలేదు. వారు వారి సిబ్బంది తరలిపోయారు.

మహంతు తన దగ్గరకు వచ్చి “ఆచార్లుగారూ ఈ హారం విషయం మీరు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోండి” అని హుకుం ఇచ్చాడు.

మరునాడు మహారాజావారు ఆలయంలోని అర్చకులందరికీ తలా ఒక నవరసు ఇచ్చారు. తనకు ప్రత్యేకంగా నూట పదహారు రూపాయలు కూడా ఇచ్చారు.

ఈ ఇరవై సంవత్సరాలు స్వామివారి సేవలో తను ఏనాడూ ఏమారలేదు. అప్రమత్తుడుగానే వున్నాడు.

ఈ ఇరవై సంవత్సరాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. తన జీవితంలోనే ఎన్నో మార్పులు వచ్చాయి. స్వామివారి ఆలయంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఆనాటి కీనాడు స్వామివారి ఆదాయం కూడా పదిరెట్లు పెరిగింది. వారి సిరిసంపదలు అనేకరెట్లు పెరిగాయి. వారి భక్తకోటి వందలువేలు దాటి లక్షలు అయిపోయింది. ఎవరిని చూసినా స్వామివారిని కొలిచేవారే. వారిని తలిచేవారే. కానీ అందరి జీవితం కన్న అంతులేని మార్పు రాజావారి జీవితంలో వచ్చింది. వారి పరగణా ప్రభుత్వపరం అయింది. వందలు వేలు సిబ్బందిని వెంట పెట్టుకుని వారు ఈ ఆలయానికి తొలిసారిగా రావడం తనకు ఈనాడు కూడా గుర్తే. కానీ ఆ రోజుకారోజు కాలం మారిపోయింది. మహారాజులు మామూలు

రాజులయ్యారు. రాజులు తరాజులైనారు. సర్వ శక్తిమంతులైన మహారాజులు సర్వస్వం పోగొట్టుకుని భరణాలమీద బ్రతకవలసి వచ్చింది. చివరకు ఆభరణం కూడా పోయింది.

పది సంవత్సరాల క్రితం సిబ్బంది లేకుండా రాజాగారు తమ రాణితో స్వామి వారి దర్శనానికి వచ్చారు. ఆ ఠీవి లేదు. ఆ హంగులేదు. కాని ఆలయంలో మాత్రం వారికి మర్యాదలు మామూలుగానే జరిగాయి. తనని చూసి ఆయన నవ్వార "క్షేమంగా ఉన్నారా" అని పలుకరించారు. క్షేమమే అని తను సమాధానం చెప్పాడు. కాని రాజావారిలో ఏదో చెప్పలేనంత మార్పు. పది సంవత్సరాల క్రితం కనుపించిన ఆనందం ఉల్లాసం ఈనాడు ఎక్కడా కనుపించడం లేదు. మనస్సులో ఏదో దైన్యం అలుముకుంది. ఏదో విచారం మనకు కనిపిస్తూనే వుంది. ఏదో పోగొట్టుకున్న వారిలాగా ఈ ఆలయానికి వారు వచ్చారు. మహారాజా వారిని తను కూర్చోమని ఆహ్వానిస్తే ఆయన నవ్వి "నేనిప్పుడు మహారాజును కాను ఆచార్లుగారూ - మామూలు మనిషిని" అని అన్నారు. తనకేం సమాధానం చెప్పాలో తెలియలేదు. ఆరోజు వారు వచ్చారని ఎంతో వైభవంగా స్వామివారి ఉత్సవం జరుపుదామని తను అనుకున్నాడు. కానీ వారి మాటలు వింటుంటే తన మనస్సు మూగపోయింది. ఎంతోబాధ కూడా కలిగింది.

కాలక్రమంలో ఇంకొక రెండు వసంతాలు గడిచాయి. మహారాజావారిని గురించి తనకు రకరకాల వార్తలు వినిపించడం మొదలు పెట్టాయి.

వారికి రాణివాసంలో సుఖం లేదని. ఆస్థానంలో ఎవరూ ఆయనతో సహకరించడంలేదని. ఆయన సిరి సంపదలు కాజేయడానికే అందరూ అనుక్షణం ప్రయత్నాలు చేస్తున్నారని, రాజ్యము, రాచరికమూ పోయినప్పటికి బాధలు. బాధ్యతలు తప్పలేదని. వారిజీవితం అశాంతిమయంగా మారిపోయిందని విన్ననాడు తనకు ఎంతో బాధ కలిగింది.

మహారాజావారి జీవితంలో సుఖశాంతులు ప్రసాదించమని ఎన్నిసార్లో దైవాన్ని ప్రార్థించాడు.

మూడు సంవత్సరాల క్రితం కాబోలు ఆ రోజు రేడియోలో కూడా చెప్పారు.

మహారాజావారు కట్టవలసిన పన్నులు ! ఇప్పుడు మహారాజులు కూడా పన్నులు కట్టాలిగా ! బకాయి క్రింద వారి భవనాలు ఆస్తులు వేలం వేసి పన్నులు వసూలు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని విన్న రోజున తన మనస్సులో ఎంతో బాధ కలిగింది. ఎంతో అక్కస్సు కలిగింది. ఆవేశం కలిగింది.

భగవంతుని లీల తనకు ఆనాడు, ఈనాడు కూడా అర్థంకాలేదు. రాజావారు ఎంతో సత్పురుషుడే ! ఎంతో ధర్మపరుడే ! అందరిలో ఎన్నికైన మనిషే. ఆయన కెందుకీ కష్టాలు? ఎందుకింత అశాంతి? తన ప్రశ్నలకు ఆనాడు ఈనాడు కూడా సమాధానం లేదు.

రెండు సంవత్సరాల క్రితం అనుకుంటాను లేదా క్రిందటి సంవత్సరమే - రాజాగారు ఒంటరిగా ఆలయానికి వచ్చారు. ఆ సిరిసంపదల ఛాయే లేదు. సిబ్బందిలేదు. చివరకు కట్టుకున్న భార్య కూడ ప్రక్కన లేదు. మామూలు ప్రజలాగా "క్యూ" లో ధర్మ

దర్శనంలో ఆయన కనిపించగానే తమకు చెప్పలేనంత ఆశ్చర్యం వేసింది. ఇరవై సంవత్సరాల క్రితం ఏనుగనెక్కి ఆలయానికి వచ్చింది వీరేనా ! అనుమానం కలిగింది.

మిగతా ప్రపంచంలో ఇరవై సంవత్సరాలే గడచి వుండవచ్చు. ఆయన జీవితంలో మాత్రం ఇరవై శతాబ్దాలు గడిచినంత దుఃఖం వృద్ధాప్యం కనిపిస్తున్నాయి. తను ఉండబట్టలేక అడగనే అడిగివేశాడు.

రాజావారు ఇల్లా ఉన్నారేమిటి? ఆరోగ్యంగా లేరా? రాజావారు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. తన వంక ఒక్కక్షణం చూశారు. నిట్టూర్పు విడిచారు.

"అన్నిరోజులు ఒక్క విధంగా నడవవు ఆచార్లుగారు. ఈ జీవన చక్రం రకరకాలుగా తిరుగుతోంది. కొన్ని రోజులు సిరి, కొన్ని రోజులు దరిద్రం, కొన్ని రోజులు సుఖం, కొన్ని రోజులు దుఃఖం, కొన్ని రోజులు కీర్తి, కొన్ని రోజులు అపకీర్తి.

ప్రపంచంలో ప్రతి మానవుడూ ఇవన్నీ అనుభవించవలసిందే. మనం సామాన్య మానవులం. సామాన్య మానవులకంటే అల్పులం. అనుభవించక తప్పదు."

ఆయన మాటలు వింటూంటే మిగతా పూజారులంతా తన వంక ఆశ్చర్యంగా చూశారు. రాజావారు వెనక్కి వెడుతూ మళ్ళీ తిరిగి వచ్చి అక్కడే కూర్చున్నారు. అనేకమంది భక్తులు స్వామివారి దర్శనం కోసం తహతహలాడుతున్నారు. గంటల తరబడి వేచి యున్నారు. రాజావారి నిమిత్తం వారినందరినీ ఆపుచేసేసరికి కల్లోలం బయలుదేరింది. జనం దుర్భాషలాడారు. కోపగించుకున్నారు. ఆలయం ధర్మకర్తలు కూడా వారిని తొందరగా పంపించవలసిందిగా తనకు పరోక్షంగా హెచ్చరిక చేశారు.

కాని వారిని అక్కడినుంచి వెళ్ళమనే అధికారం కానీ, ఆలోచన కానీ తనకు రాలేదు. ఎట్టకేలకు ఆయన లేచారు. స్వామివారి వంక తదేక దృష్టితో చూశారు. ఎన్నడూ చెయ్యని పని స్వామివారి పాదాలు స్పృశించారు. స్వామివారి విగ్రహాన్ని స్పృశించడానికి ఎవ్వరికీ ఎన్నడూ అనుమతి ఇవ్వని తను రాజావారు అలా స్పృశిస్తూ వుంటే తను స్థాణువులాగా నిలబడిపోయాడు. వెళ్ళబోయేముందు రాజావారు తన దగ్గరకు వచ్చి ఒక్కమాట అన్నారు. "మళ్ళీ ఎప్పుడు కలుస్తామో.ఏమో!" తను ఏం మాట్లాడలేకపోయాడు.

"ప్రతి నిత్యం తమను తల్చుకుంటూనే వుంటా. ప్రతీనిత్యం తమ దర్శనం కోసం ఎదురుచూస్తూ వుంటాం" అని మాత్రం తను అనగల్గాడు. రాజాగారు వెళ్ళిపోయారు.

తరువాత కొన్ని రోజులకు తనకు తెలిసింది దర్బారులోని పొట్లాటలు, తగాదాలు, కుతంత్రాలు, తట్టుకోలేక రాజావారు ఆస్థానం వదిలి వెళ్ళిపోయారని, పరదేశంలో పర్యటన చేస్తున్నారని. అప్పుడప్పుడూ అక్కడక్కడ పుణ్యక్షేత్రాలలో వాళ్ళకు వీళ్ళకు కన్పిస్తున్నారని.

ఈ వార్తలు విన్నప్పుడు తనకు ఒక నిర్ణయం వచ్చింది. ఒక ఆలోచన మనస్సులో మెదిలింది. ఈసారి మహారాజావారు ఆలయానికి వచ్చినప్పుడు వారితో ఒక మాట చెప్పాలని మీరు మా దేవస్థానంలో వుండండి అని - కాని అంతలోనే నవ్వు వచ్చింది. ఆయన మహారాజు తను ఒక ఆలయంలో పూజారి - వారికి సలహా ఇవ్వగల్గిన శక్తిగాని అర్హతగాని తనకు వుందా !

ఈనాడు విజయదశమి. ఈనాడు మహారాజావారు వస్తారు. ఇప్పటికే ప్రొద్దుపోయింది. స్వామివారి ఏర్పాట్లు చకచకా చెయ్యాలి అనుకుంటూ సుందరమాచారి ఆలయానికి వెళ్లాడు. అప్పటికే అన్ని ఏర్పాట్లు జరుగుతున్నవి. క్రితం రోజున స్వామివారు ధరించిన దండలు తీసివేశారు. నిర్మాల్యం తుడిచి వేశారు. ఆభరణాలు తీసి విడిగా పెట్టారు.

స్వామివారికి మంగళ స్నానాలు చేయించారు. పట్టు పీతాంబరాలు దరింపచేశారు. పూలమాలలు వేసేముందు ఒక్కొక్క ఆభరణం తీసుకువచ్చి అలంకరించడం మొదలుపెట్టారు. నిత్యంకన్నా ఈనాడు స్వామివారు దేదీప్యమానంగా వున్నా ఏదో లోపం కనిపిస్తోంది.

మహారాజావారు ఇచ్చిన వజ్రాలహారం కనిపించదేం? ఏది? ఏమైంది. ఒక్క క్షణం గుండె ఝల్లుమన్నది. స్వామివారి దర్శనానికి వచ్చిన ఒక వజ్రాల వర్తకుడు తనతో ఒకసారి చెప్పడు. ఈ వజ్రాలహారం ఈనాడు వెల కడితే నలభై లక్షల రూపాయలు అవుతుందని.

ఏమైంది నలభై లక్షల రూపాయల హారం? స్వామివారి సన్నిధిలో ఏనాడూ పూచిక పుల్లకూడా పోలేదే ! ఈనాడు ఎల్లా మాయమైంది? వజ్రాల హారం. సుందరమాచారికి కాళ్ళూ చేతులు ఆడలేదు. మహంతుతో చెప్పారు. ధర్మకర్తలతో చెప్పారు. అందరూ ఒకటేమాట అన్నారు- వెదకండి !

అంతా వెదకడం మొదలుపెట్టారు. పూజకు వేళమించి పోతోంది. కానీ మంత్రం చెప్పడానికి మనస్సుకు స్తిమితం ఏదీ?

స్వామివారు నిన్న ధరించిన దండలు పూజచేసిన నిర్మాల్యం పువ్వు, పువ్వు రేకు, రేకు వెదకగా వజ్రాలహారం కనిపించింది. కానీ తెగిపోయింది.

ఇరవై సంవత్సరాలుగా, చెక్కుచెదరని హారం ఈనాడు ఎందుకు తెగింది?

కంసాలి బత్తుడు వచ్చి చూశాడు. ఇది బంగారం కాదండి. "ప్లాటినమ్ మదరసులో కాని దీన్ని బాగు చెయ్యలేరు" అని అన్నాడు. ఇరవై సంవత్సరాలుగా ఈహారం స్వామివారి మెడలో వుంది. ఈనాడు ఈ హారం లేకుండా ఎలా? సుందరమాచారి ఆలోచనలు తెగటంలేదు.

పోనీ దారంతో ముడివేస్తే, నలభై లక్షలు విలువ చేసే హారం దారంతో ముడివేయడమా?

మహంతు వచ్చి పూజ ప్రారంభించండి అని అన్నాడు. సుందరమాచారికి ఏం చేయ్యాలో పాలుపోలేదు. హారం స్వామివారి పాదాల దగ్గర వుంచి ఓం కేశవాయ స్వహాః మాధవాయ స్వహాః అంటూ పూజ ప్రారంభించాడు. ఇంతలో బయట పెద్ద గందరగోళంగా వుంది. అంతలోనే పిడుగు పడ్డంత నిశ్శబ్దం.

"ఆచారీ, ఆచారీ" అంటూ మహంతు లోపలికి వచ్చాడు." విన్నావా ఎంత ఘోరం జరిగిందో."

"ఏం జరిగింది !"

"మన మహారాజావారు మరణించారు" "ఎప్పుడు ఎప్పుడు" అని తను అడిగాడు.

ఈనాటి ఉదయమే - ఎక్కడ? వారు కట్టించిన ధర్మ సత్రంలో ! ఎంత అన్యాయం జరిగింది ఎంత ఘోరం జరిగింది?

తనేం మాట్లాడలేకపోయాడు. పూజ మిగతా పూజారులకు అప్పచెప్పి స్వామివారి పాదాల దగ్గర కూలబడ్డాడు.

ఒక మహనీయుడు వెళ్ళిపోయాడు. ఆకాశంలో ఒక తార రాలిపోయింది.

కన్నీటి తెరల వెనకనుంచి స్వామివారి వదనం అస్పష్టంగా కనిపిస్తోంది.

"ఆచార్లుగారూ" అంటూ మహారాజా వారి కంఠం విన్పించంది. ఉలిక్కిపడి స్వామివారి విగ్రహం వంక చూశాడు. దూరంగా ఏదో లోకంలోంచి వినిపిస్తున్నట్లుగా -

"ఆచార్లుగారూ వెళ్ళివస్తాను ! ఈ దైవం చల్లని నీడ వదిలి ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతున్నాను. స్వామివారిని జాగ్రత్తగ కొలుచుకోండి. ఈ సంవత్సరం దర్శనం చేసుకోలేకపోయాను. క్షమించండి. మళ్ళీ మనం కలుద్దాం. మీ స్వామివారి నీడలోకి మళ్ళీ రావాలని వుంది. సెలవు" జేగంట శబ్దం విని ఉలిక్కిపడి ఆచార్లుగారు స్వామివారి పాదాల వంక చూశాడు. మహారాజావారి చిరునవ్వులాగా వజ్రాలహారం మిలమిల మెరుస్తోంది.

(ఆల్ ఇండియా రేడియో మద్రాసు కేంద్రం సౌజన్యంతో)

# ధ్వజస్తంభం

నాలుగు దిక్కులా మబ్బులు కమ్ముకున్నాయి. ఈదురుగాలి క్షణం క్షణం ఎక్కువౌతూంది. పగలు గడవకుండానే చీకటి వచ్చింది.

చెప్పకుండానే తెలుస్తూంది. పెను తుఫాను రాబోతూంది అని.

తుఫాను వచ్చినా, ప్రళయం వచ్చినా దైవకార్యం ఆగడానికి వీలులేదుగా ! అందుకనే అంత గాలిలోను, వానలోను గుళ్ళోకి బయలుదేరాడు పూజారి లక్ష్మయ్య. ఇల్లు గుడి ఆవరణలోనే ఉంది. పట్టు మని పాతిక గజాల దూరం ఉండదు. చీకట్లో, ఎదురుగాలిలో ఈ రవ్వంత దూరం నడవడానికి పదిసార్లు దైవాన్ని తలుచుకోవలసి వస్తూంది. ఆనాటి దారుఢ్యం లేదు. ఆ ధైర్యం లేదు. ఇప్పుడు అడుగడుగునా ఆయాసమే. క్షణం క్షణం అనుమానమే.

గుడికి పెడగా ఉన్న ఊళ్ళోంచి ఇప్పుడిప్పుడే మిణుకు మిణుకుమని దీపాలు వెలుగుతున్నాయి.

గాయపడ్డ ఏనుగు లాగా తుఫానుగాలి ఘీంకరిస్తూంది.

అలవాటుగా "రామా ! కోదండరామా !" అంటూ కోనేరు దగ్గరకు వచ్చాడు. కుంభవృష్టి వల్ల నీళ్ళు నేలబారుకు వచ్చేశాయి. మెట్లు మునిగిపోయాయి. అక్కడే నిలబడి స్నానం చేశాడు.